

గుమ్మడిదొడ్డిలో చిరుత?

వాజేడు మండలంలోని దూలాపురం రేంజ్ పరిధిలోని గుమ్మడిదొడ్డి సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం. -8లో▸



వెండితెరపై 'పేట' యువకులు

నర్సంపేట నియోజకవర్గానికి చెందిన యువకులు తమ నటనతో సినిమా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. -8లో▸

గరిష్టం/కనిష్టం
27^0 / 16^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం చల్లగాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురిసి చలి ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఆడపిల్లల కుటుంబాలకు కల్యాణలక్ష్మి వరం



వెంకటాపురం(ఎం): నిరుపేద ఆడపిల్లల కుటుంబాలకు కల్యాణలక్ష్మి వరమని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలోని 59 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎంపీడీఓ, ఎంపీఓ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ దైవగ్రంథం భగవద్గీత



వాజేడు: సృష్టిలో ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ వేదిక వరంగల్ కమిటీ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ ఆచారి అన్నారు. బుధవారం వాజేడుకు వచ్చిన ఆయన భగవద్గీత, 100 అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వాపర యుగంలో యుద్ధరంగంలో ఉన్నప్పుడు మొట్ట మొదటి రోజున అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించినట్లు తెలిపారు. సృష్టిలో ఏ మతం లేని కాలంలో భూమి పుట్టిన కొద్ది నెలలకే భగవద్గీత సారాన్ని సూర్యుడికి తెలుపగా అతను మనువుకు, మనువు ఇక్ష్వాకుడనే రాజుకు, రాజు ప్రజలకు ఇలా తెలియజేసినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధర్మాలు పెరిగిపోయాయని గీతలో ఉన్న ధర్మాలను ప్రతీ ఒక్కరు పాటించాలని సూచించారు.

యాజమాన్యం దృష్టికి కార్మికుల సమస్యలు



భూపాలపల్లి అర్బన్: రెండ్రోజుల క్రితం ఏరియా స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో కార్మికుల సమస్యల్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేశ్ తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏరియా సింగరేణి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని, కృష్ణకాలనీ, కారల్‌మార్క్స్ కాలనీల్లోని డిస్పెన్సరీని సక్రమంగా నడిపించాలని, రామప్ప కాలనీలో నూతన డిస్పెన్సరీలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో నెలవారీగా సమావేశాలు నిర్వహించాలని, ఆస్పత్రి సిబ్బందికి ఓటీ, ఓడీ చెల్లించాలని, క్వార్టర్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, శిథిలావస్థకు చేరిన వాటిని మరమ్మతు చేయాలని, రామప్ప కాలనీలో ఓపెన్ జిమ్, స్విమ్మింగ్ పూల్, కూరగాయల మార్కెట్, శ్మశాన వాటిక, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. గనుల్లో కార్మికుల సమస్యల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడికి అరుదైన అవార్డు



కాటారం: కాటారం మండల కేంద్రంలోని గంటగూడేనికి చెందిన ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ గంట ఆనందంకు అరుదైన అవార్డు దక్కింది. విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల 35 రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి కామధేను అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా డాక్టర్ ఆనందం ఆయుర్వేదం కేటగిరీలో అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా చేతుల మీదుగా అవార్డు, సన్మానం అందుకున్నారు. ఈసందర్భంగా కరోనా మహమ్మారి నివారణకు ఆయుర్వేదం ద్వారా మందును కనిపెట్టి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసిన డాక్టర్ ఆనందం సేవలను పలువురు కొనియాడారు. ఆనందం మంచిర్యాల పట్టణంలో ఆయుర్వేద వైద్యశాల స్థాపించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయన ప్రతిష్టాత్మకమైన అవార్డు అందుకోవడంపై కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



సమ్మెబాటలో..

రిలే దీక్షలపై స్పందన లేకపోవడంతో అసహనం

- హామీలు అమలు చేయాలని డిమాండ్
- అధికారులకు సమ్మె నోటీసుల అందజేత

ములుగు రూరల్: విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తూ ఇరవై సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. మూడు రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఉద్యోగులు.. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో అధికారులకు నోటీసులు అందించి సమ్మెబాట పట్టారు. విద్యాశాఖలోని మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పలు కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు సమ్మె చేస్తుండడంతో కార్యకలాపాలు కుంటుపడే అవకాశం ఉంది.

13 విభాగాల్లో..

సమగ్ర శిక్షా ఉద్యోగులు విద్యాశాఖలోని 13 విభాగాల్లో సేవలందిస్తున్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో యూఆర్ఎస్‌లు, కేజీబీవీ పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీ, సీఆర్‌టీ, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్, మండల స్థాయిలో ఎంఆర్సీల్లో, జిల్లా స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, కేర్ గివింగ్ సిబ్బంది, సీఆర్పీలు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, మోడల్ స్కూల్స్ హాస్టల్ నాన్ టీచింగ్ 307 కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

రిలే దీక్షలకు కరువైన స్పందన !

సమగ్ర శిక్షా ఉద్యోగులు ఈ నెల 06వ తేదీన రిలే దీక్షలను మండల స్థాయిలో నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు నోటీసులు అందించారు. మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు..

- సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలి
- ప్రతి ఉద్యోగికి రూ.20లక్షల జీవిత బీమా చేయాలి
- ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి
- మహిళలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులివ్వాలి
- 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు రూ.20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి
- సమగ్ర శిక్షా పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలి
- విధుల్లో మరణించినవారి కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.
- సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో కలపాలి.

డిమాండ్లను పరిష్కరించాలి



గత ఇరవై సంవత్సరాలుగా సమగ్ర శిక్షా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, జీవిత బీమా, ఆరోగ్య బీమా అందించాలి. సమగ్రశిక్షా విభాగాన్ని విద్యాశాఖలో విలీనం చేయాలి. ఉద్యోగుల రీ ఎంగేజ్ విధానాన్ని రద్దు చేయాలి.

\- చల్లా భాస్కర్‌రెడ్డి, జేఏసీ జిల్లా అధ్యక్షుడు

హామీలు అమలు చేయాలి



సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా.. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయడం లేదు. హర్యానాతోపాటు పలు రాష్ట్రాల్లో సమగ్రశిక్షా ఉద్యోగులకు మినిమం టైం స్కేల్‌తోపాటు రెగ్యులర్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

\- కుమార్ పాద్య, ఎస్ఎస్ఏ జేఏసీ కార్యదర్శి

పరస్పర బదిలీలపై ఆశలు

- రిజిస్ట్రేషన్ శాఖలో ఈనెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కోరుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లనున్న అధికారులు
- జోన్–4 పరిధిలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ ఫీవర్



కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో ప్రభుత్వం 6 నెలల క్రితం బదిలీలు చేపట్టింది. జీరో ట్రాన్స్‌ఫర్స్ ఆర్డర్స్‌లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ నుంచి అటెండర్ స్థాయి వరకు బదిలీపై వెళ్లారు. కాగా, జోన్–4లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఏకకాలంలో బదిలీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. 317 జీఓ ప్రకారం స్థానికత, స్పౌజ్ కోటాను ప్రాతిపదికన తీసుకోకుండా చేపట్టిన బదిలీల్లో ఇబ్బందులు పడుతున్న అధికారులకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరస్పర బదిలీల కోసం కేబినెట్ సబ్ కమిటీ 292 జీఓ ఎంఎస్‌ను నవంబర్ 29న విడుదల చేసింది. దీంతో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు పరస్పర బదిలీల్లో భాగంగా కోరుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేందుకు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మేమే వస్తున్నాం.. మా సారే వస్తున్నాడు!

వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని పలువురు అధికారులతోపాటు డాక్యుమెంట్ రైటర్లు ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా, సబ్ రిజిస్ట్రార్‌గా మా సారే వస్తున్నాడు అంటు ఇక మా హవా నడుస్తుంది అంటు చర్చించుకుంటున్నారు. కాగా, మేమే వస్తున్నామంటూ అధికారులు సైతం సంకేతాలు పంపుతున్నట్లు కార్యాలయంలో చర్చ జరుగుతోంది.

స్పౌజ్, మెడికల్ విభాగంలో బదిలీలు కూడా..

రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో పరస్పర బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 317 జీఓ నుంచి ఉపశమనం పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈనెల 1 నుంచి 31 వరకు po2018mutualtransfers.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదేవిధంగా స్పౌజ్, మెడికల్ విభాగ బదిలీలు చేపట్టనున్నట్లు సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు ఆన్‌లైన్‌లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని తెలుస్తోంది. నయా సాల్ నయా ఆఫీస్ అనే చందంగా రాష్ట్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్‌ను కల్పించనుంది.

వరంగల్ ఆర్వోపై కన్ను..

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బదిలీ అయిన సబ్‌రిజిస్ట్రార్లు వరంగల్ ఆర్వోపై కన్ను వేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. తిరిగి యథాస్థానానికి వచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో జోన్–4లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ ఫీవర్ కొనసాగుతోంది. వరంగల్ ఆర్వో కార్యాలయంలోని ఆడిట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఫణీందర్ బదిలీల్లో భాగంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టగా, ఆడిట్ జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా డీఐజీ కొనసాగుతున్నారు. కాగా, ఆడిట్ జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ స్థానాన్ని దక్కించుకునేందుకు పలువురు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- తరలివచ్చిన భక్తజనం
- మహాఅన్నదాన కార్యక్రమం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయంలోని శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మండపంలో వేంకటేశ్వరస్వామి అలివేలుమంగ, పద్మావతి కల్యాణ వేడుకలను అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ, మణికంఠ శర్మలు బుధవారం వైభవంగా జరిపించారు. గీతాజయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని రామాలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని ప్రారంభించిన అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను తిరుపతి నుంచి ప్రత్యేకంగా తెప్పించి కల్యాణాన్ని జరిపించారు. స్వామి వారి తలంబ్రాల కోసం భక్తులు పోటీ పడ్డారు. కల్యాణ వేడుకలను చూసేందుకు సమీప మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులు అన్నదానంలో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అభివృద్ధి, ఫంక్షన్‌హాల్ నిర్మాణం, ప్రహరీ నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చిన దాతలకు కమిటీ వారు కృతజ్ఞతలు తెలిపారు. అర్చకులు భానుప్రకాశ్‌శర్మ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీని అంతమొందించడమే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

ములుగు: నిర్దిష్ట ప్రణాళికతో 2030 వరకు హెచ్‌ఐవీని అంతమొందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ములుగు ఏరియా ఆస్పత్రిలో నాకో అండ్ టీజీ సాక్స్, మారి సంస్థ తరఫున నిర్వహించిన ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రాం, కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు(దిశ) సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టడానికి హై రిస్క్ ప్రాంతాల వారీగా బృందాలతో సర్వే చేయిస్తామని అన్నారు. నూతనంగా హెచ్‌ఐవీ సోకిన వారిని గుర్తించి వ్యాధి లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పిస్తామన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ సోకిన వారిపై వివక్షత చూపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. ప్రతి మనిషికి సమాజంలో బతికే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతకాళ్లపై నిలబడాలని ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో డెమో సంపత్, ఎయిడ్స్ కంట్రోల్ క్లస్టర్ మేనేజర్ జ్యోతి, మారి నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ ప్రోగ్రాం మేనేజర్ సదానందం పాల్గొన్నారు.

ఏటీసీ పనులు ప్రారంభం



కొనసాగుతున్న ఏటీసీ భవన నిర్మాణ పనులు

కాటారం: ప్రభుత్వ ఐటీఐ అనుసంధానంగా మండల కేంద్రంలోని తిమ్మన్నకుంటలో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు మొదలుపెట్టాడు. మండలానికి ఏటీసీ కేంద్రం మంజూరవగా భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు కేటాయించింది. కొన్ని నెలలుగా స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. మొదట్లో మండలంలోని గంగారం మోడల్ స్కూల్ సమీపంలోని ప్రభుత్వ భూమిని కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఏటీసీ నిర్మాణానికి కేటాయించారు. గ్రామానికి చెందిన పలువురు అడ్డుకోవడంతో వివాదాస్పదంగా మారి కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టలేదు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో మండల కేంద్రంలోని తిమ్మనకుంట శిఖం భూమిలో అధికారులు భవన నిర్మాణానికి తిరిగి స్థలం కేటాయించారు. ఈభూమికి సైతం పలువురు రైతులు, గ్రామస్తులు అడ్డురావడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. దీంతో శిఖం భూమిలో మరో పక్కన భవన నిర్మాణానికి అధికారులు స్థలం చూపించడంతో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి.

విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

సైన్స్‌ఫెయిర్‌లో మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ దివాకర, అధికారులు



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తరగతి గదిలో వాస్తవిక దృక్పథాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని బోధించాలని సూచించారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా కృషి చేయాలన్నారు. శాస్త్రవేత్తలు సమాజాన్ని ప్రకృతిని పరిశీలించి అనేక రకాల ఆవిష్కరణలు చేశారని అన్నారు. విద్యార్థులు భారతీయ శాస్త్రవేత్తల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గణితాన్ని ఇష్టపడి చదివిన వారు తమ సృజనతో నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు త్వరగా పరిష్కారం చూపగలుగుతారని అన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ములుగు జిల్లాకు పేరుతీసుకురావాలని అన్నారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలో ఉంచిన ఎగ్జిబిట్లను కలెక్టర్‌తో కలిసి వీక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మండల పరిషత్ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని అన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని జిల్లాకు పేరుతీసుకురావాలన్నారు. బాలికలతో కలిసి మంత్రి సీతక్క కబడ్డీ ఆడారు.

చెక్కుల పంపిణీ

ములుగు: 38 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మంత్రి సీతక్క బుధవారం చెక్కులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఈఓ పాణిని, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, ఎంఈఓ సామల శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అధికారి తుల రవి, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలి

భూపాలపల్లి అర్బన్: కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి కోరారు. 55వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ఏరియాలోని కేటీకే 6వ గనిని కమిటీ సభ్యులు సందర్శించారు. ఈసందర్భంగా గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏరియా జీఎం మాట్లాడుతూ.. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని మాత్రమే చేయాలని సూచించారు. స్వీయరక్షణ పాటిస్తూ కంపెనీ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కన్వీనర్ సైదులు, అధికారులు వెంకటరమణ, ప్రసాద్, రామ్, నాగరాజు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు రమేశ్, అశోక్, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



అధ్యక్ష మెడల్ స్వీకరిస్తున్న డాక్టర్ నాగార్జునరెడ్డి

ఎంజీఎం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 2024–25 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం బుధవారం రాత్రి నగరంలోని ఐఎంఏ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. ముందుగా ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ బాన్సలీ, రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకాంతరెడ్డి, ఎన్ఏటీసీఓఎన్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కాశీప్రసాద్, శేషుమాధవ్‌లతో పాటు ప్రస్తుత కార్యవర్గ సభ్యులు, నూతన కార్యవర్గ సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ దగ్గరినుంచి నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ నాగార్జునరెడ్డి అధ్యక్ష మెడల్‌ను స్వీకరించారు. అనంతరం డాక్టర్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. వైద్యుడిగా ప్రభుత్వ విధులతోపాటు ఐఎంఏకు సైతం తన పూర్తి సహకారం అందిస్తానన్నారు. ముఖ్య అతిథులు ప్రసంగిస్తూ ఐఎంఏ సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు వైద్యులు, వైద్యవిద్యార్థులకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి అజిత్ మహ్మద్, ఆర్థికశాఖ కార్యదర్శి శిరీష్‌కుమార్, ఉపాధ్యక్షులు శిరష, నరేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు స్వప్న చౌరస్, రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్‌లు ప్రమాణస్వీకారం చేశారు. వేడుకల్లో ఐఎంఏ ప్రతినిధులు ప్రవీన్, తెలుగు రామకృష్ణ, బందెల మోహన్‌రావు, వద్దిరాజు రాకేశ్, హరి సంధ్యరాణి, సుదీప్, బాలాజీ, కస్తూరి ప్రమీళ, పిల్లి సాంబశివరావు, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న వేదపండితులు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం ఆదిముక్తీశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనను గురువారం నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం పునఃప్రతిష్ఠ పూజలను వేద పండితులు ఘనంగా ప్రారంభించారు. ఆసిఫాబాద్ జిల్లా అచ్చలాపూర్‌లోని శ్రీమహాదేవ వేద పాఠశాల ప్రధాన అధ్యాపకులు దుద్దిళ్ల మనోహరశర్మ అవధాని ఆధ్వర్యంలో సాయంత్రం 4.30గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం (నేడు) ఉదయం 8.26 గంటలకు ఆలయం ఎదుట ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ చేయనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈఓ ఏ.మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, ఉప ప్రధాన అర్చకులు పనకంటి ఫణీంద్రశర్మ పాల్గొన్నారు.

వెండితెరపై 'పేట' యువకులు

హీరోలుగా రాణిస్తున్న నర్సంపేట నియోజకవర్గ వాసులు

- సినీ పరిశ్రమలో ప్రతిభతో ముందుకెళ్తున్న ముగ్గురు ..
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబికులు, గ్రామస్తులు

నర్సంపేట : ఆ ముగ్గురికి చిన్నప్పటి నుంచి సినిమా అంటే ప్రాణం. ఎలాగైనా సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నారు. అందుకు ఎక్కడ ఆడిషన్స్ జరిగినా వెళ్లే వారు. అలాగే, వివిధ సినిమా ఆఫీస్‌ల చుట్టూ తిరిగే వారు. చిన్న పాత్ర అయినా ఇవ్వమని కోరారు. తెలిసి వారి వద్దకు వెళ్లి తమలోని నటనా ప్రావీణ్యాన్ని ప్రదర్శించే వారు. అవకాశం వచ్చినట్లు వచ్చే చేజారేది. అయినా ఏమాత్రం నిరాశపడేవారు కాదు. మళ్లీ ప్రయత్నం చేసేవారు. చివరకు అనుకున్నది సాధించారు. తమ ఆకాంక్షకు అనుగుణంగా అవకాశం రావడంతో ఆ ముగ్గురు యువకులు హీరోలుగా రాణిస్తున్నారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారు తమప్రతిభతో ముందుకెళుతున్నారు. వారే నర్సంపేట నియోజకవర్గానికి చెందిన బూరగాని అనిల్, భూక్య సిద్దు శ్రీఇంద్ర, బూస కుమార్. ఈ ముగ్గురు హీరోలుగా నటించిన తమ సినిమాలు ఇప్పటికే విడుదలయ్యాయి.



అనిల్ నటన అద్భుతం..

బూరగాని అనిల్‌ది నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ మండల కేంద్రం. తల్లిదండ్రులు బూరగాని కొమురయ్య–రమాదేవి. అనిల్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. సినిమాపై ఆసక్తి ఉండడంతో ఆ రంగం వైపు వెళ్లాడు. పలువురి వద్దకు వెళ్లి తన ప్రతిభను తెలియజేశాడు. వారికి అనిల్ నటన నచ్చడంతో అవకాశం ఇచ్చారు. దీంతో అనిల్ 'వజ్రాలు కావాలా నాయనా' అనే సినిమాలో మొదటిసారిగా నటించారు. ఈ సినిమా ఫిబ్రవరి 2017న విడుదలైంది. ఇందులో అనిల్ అద్భుత నటనకు పలువురు ముగ్ధులయ్యారు. రెండో సినిమా 'ఇరావణ' విడుదలకు సిద్ధంగా ఉంది. దీంతో పాటు ప్రేమతో మీ అభిరామ్, దునియా, ప్రేమకుజై, తదితర చిత్రాల్లో నటిస్తున్నట్లు అనిల్ చెప్పాడు. కాగా, టీవీషోలు అత్తారింటికి దారేది, శ్రీమంతుడు, రాజేశ్వరివిల్లాస్ కాఫీ క్లబ్, అనుపల్లవి, కలవారి కోడలు కనకమహాలక్ష్మి వంటి సీరియల్‌లో నటిస్తున్నట్లు అనిల్ తెలిపారు.



బూరగాని అనిల్



సిద్దు..'అనాథ'

భూక్య సిద్దు గిరిజన ప్రాంతంలో పుట్టి పెరిగాడు. తనలో ఉన్న నటనా ప్రావీణ్యంతో సినిమా రంగంలో రాణించాలని 13 సంవత్సరాల నుంచి ప్రయత్నం చేస్తున్నాడు. చివరకు అదృష్టం వరించింది. వారం రోజుల క్రితం 'అనాథ' అనే సినిమాను నిర్మించి హీరోగా వెండి తెరకు పరిచయమయ్యాడు. మొదటి సినిమాలోనే మంచి నటన ప్రావీణ్యం కనబర్చడంతో ఈ సినిమా పలువురిని ఆకట్టుకుంది. నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లెకు చెందిన సక్కు, సరోజన దంపతుల కుమారుడు సిద్దు. మ్యూజిక్ డైరెక్టర్, ప్రొడ్యూసర్, హీరోగా రాణిస్తూ గోనేంద్ర ఫిలింస్ సంస్థ ద్వారా అనాథ సినిమాను తెలుగు, కన్నడంలో తీసి ప్రేక్షకులను మెప్పించాడు. ప్రస్తుతం రెండో సినిమా కూడా తీస్తున్నట్లు సిద్దు తెలిపారు.



హీరోయిన్‌తో బూస కుమార్

'రియల్' రంగం నుంచి హీరోగా..

రియల్ ఎస్టేట్ రంగంలో రాణిస్తూనే సినిమా హీరోగా గుర్తింపు పొందాలనే తపనతో వెండి తెరకు పరిచయమయ్యాడు నర్సంపేట నియోజకవర్గంలోని గుర్రాలగండి రాజపల్లి గ్రామానికి చెందిన బూస కుమార్. సినిమా రంగంలోని పలువురు ప్రముఖులను కలిసినా ఎవరూ అవకాశాలు ఇవ్వలేదు. దీంతో తానే స్వయంగా 'షాన్' అనే సినిమాను రూపొందించాడు. ఇందులో తనే హీరోగా నటించాడు. అంతేకాకుండా నిర్మాత, దర్శకుడిగా వ్యవహరించి గత సంవత్సరం తన అదృష్టం పరీక్షించుకున్నాడు. వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు పూర్తిగా అవగాహన ఉండడంతో ఆయా ప్రాంతాల్లో చిత్రీకరణ చేసి తన ఆలోచనలకు అనుగుణంగా సినిమా పూర్తి చేశాడు. అనంతరం విడుదల చేసి సఫలీకృతుడయ్యాడు. ప్రస్తుతం మరో సినిమా కూడా చేస్తున్నట్లు 'సాక్షి'కి వివరించాడు.

క్లుప్తంగా

ఏసీ బస్సుల్లో చార్జీల తగ్గింపు

హన్మకొండ: ఆర్టీసీ ఏసీ బస్సుల్లో చార్జీలు తగ్గించినట్లు వరంగల్–2 డిపో మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. ఏటూరునాగారం ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ బస్సుల్లో చార్జీలపై 10 శాతం రాయితీ అందిస్తున్నామని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు రూ.620 ఉండగా దీనిని రూ.570కి తగ్గించామని, ములుగు నుంచి హైదరాబాద్‌కు రూ.480 నుంచి రూ.440కి తగ్గించినట్లు వివరించారు. ఏటూరునాగారం, ములుగు ప్రాంత ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

19 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



గంజాయి విక్రేత అరెస్ట్ చూపుతున్న ఎస్సై

బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లి గ్రామం వద్ద పోలీసులు బుధవారం ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా సంబల్పూర్ గ్రామానికి చెందిన నాబా కిషోర్ పాయక్ నుంచి 9 ప్యాకెట్లలో 19 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 4.75 లక్షలు ఉంటుందని తెలిపారు. కిషోర్ పాయక్ ఒడిశా నుంచి ముంబాయికి గంజాయి సరఫరా చేస్తుండగా మార్గమధ్య జనగామ రైల్వే స్టేషన్‌లో పోలీసులను చూసి భయపడి రైలు దిగాడన్నారు. అనంతరం ఆటో ఎక్కి తమ్మడపల్లిలో దిగాడని పేర్కొన్నారు. సమాచారం మేరకు వెళ్లి అతడిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి అరెస్టు చేశామని ఎస్సై వెల్లడించారు.

లారీ, బైక్ ఢీ..

- వ్యక్తి దుర్మరణం.. ఐనవోలులో ఘటన



కనుకయ్య మృతదేహం

ఐనవోలు: లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లుకు చెందిన ఎర్రం కనుకయ్య(54)బైక్‌పై బొల్లికుంట వద్ద జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో ఐనవోలు నుంచి వరంగల్ వైపునకు లారీ వెళ్తోంది. మండల కేంద్రంలోని శివారు మలుపు వద్దకు చేరుకునే క్రమంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. కనుకయ్య కింద పడగా లారీ అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ కొద్దిదూరం రాసుకుని వెళ్లగా .. ట్యాంక్‌లో పెట్రోల్ లీకై మెరుగులకు మంటలు చెలరేగి బైక్ పూర్తిగా కాలింది. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై శ్రీనివాస్.. కనుకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సమ్మక్క, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కోడెల పంపిణీపై క్షేత్రస్థాయి పరిశీలన

- మనుగొండ, అనంతారంలో ఆరా తీసిన వేములవాడ గోశాల అధికారి

గీసుకొండ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాల నుంచి రైతులకు పంపిణీ చేసిన కోడెల విషయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి గోశాల సూపరింటెండెంట్ వి. నర్సయ్య, క్లర్క్ జి. రవి సోమవారం గీసుకొండ మండలానికి వచ్చారు. రాజన్న కోడెలను మనుగొండకు చెందిన మాదాసి రాంబాబుతో పాటు అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, పసునూటి శ్యాంసుందర్ అనే వ్యక్తులు రైతుల పేర తీసుకొచ్చి కబేళాలకు అమ్ముకున్నారనే విషయం బయటపడడంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే రైతుల పేరిట పంపిణీ చేసిన కోడెలు వారి వద్ద ఉన్నాయా లేదా అనే విషయం క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికి సూపరింటెండెంట్ రికార్డులను వెంట తీసుకొచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుత ఏడాది మొత్తం 42 మందికి 86 కోడెలను పంపిణీ చేశామని తెలిపారు. అక్రమాలు వెలుగు చూసిన మనుగొండలో 9 మంది రైతులకు 18, అనంతారంలో పది మంది రైతులకు 20 కోడెలను పంపిణీ చేసినట్లు రికార్డుల్లో ఉందన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే సదరు రైతుల వద్ద కోడెలు లేవని తేలిందని, తాము గమనించిన విషయాలను వేములవాడ అధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. కాగా, కోడెల్లో కొన్ని మృత్యువాత పడ్డాయని రాంబాబు చెప్పిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మనుగొండలో అతడి చేను వద్ద గీసుకొండ ఎస్సై కుమార్ సమక్షంలో మండల పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి.. పూడ్చిన గోతిని తవ్వగా అందులో కోడె కళేబరం ఉన్నట్లు గుర్తించారు.



మనుగొండలో గ్రామస్తుల వద్ద కోడెల విషయమై ఆరా తీస్తున్న నర్సయ్య

కాజీపేట మీదుగా కుంభమేళా యాత్ర రైలు

- జనవరి 19న ప్రయాణం..
- 3 పుణ్యక్షేత్రాల సందర్శన

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా మహాకుంభమేళా యాత్ర రైలును 2025 జనవరి 19న ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్‌సెంగర్ తెలిపారు. కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లో జనవరి, ఫిబ్రవరిలో 12 ఏళ్లకు ఒకసారి జరిగే మహాకుంభమేళాను పురస్కరించుకుని భారత్ గౌరవ్ టూరిస్ట్ స్పెషల్ ట్రైన్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. అయోధ్య, వారణాసి, ప్రయాగ్‌రాజ్ పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర 7 రాత్రులు, 8 రోజులు కొనసాగుతుందన్నారు. ప్రారంభ ధర రూ.22 వేల ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ఇతర వివరాలకు 92810 30711,9701360701, 9281030749 నంబర్లు, వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఆర్‌సీటీసీటూరిజం.కామ్.లో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్స్ నరేశ్‌బాబు, కె.ప్రశాంత్ పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్ మీదుగా గౌరవ్ ప్రత్యేక రైలు

కాజీపేట జంక్షన్‌కు బుధవారం ఐఆర్‌సీటీసీ గౌరవ్ టూరిస్ట్ ప్రత్యేక రైలు చేరుకుంది. ఈ ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్ నుంచి 30 మంది యాత్రికులు బయలుదేరి వెళ్తున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్, పక్కన ప్రతినిధులు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- మంత్రి ధనసరి సీతక్క

ములుగు: నాణ్యమైన విద్యనందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు బుధవారం ములుగు కలెక్టరేట్‌లో క్వాల్ కామ్ కంపెనీ, ట్రాన్స్‌ఫాం స్కూల్స్ యాజమాన్యం తరఫున 9, 10వ తరగతుల్లో ఇంగ్లిష్, గణితం, సైన్స్ విభాగాల్లో విద్యాబోధన చేపట్టే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించగా మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి శిక్షణ తరగతుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విషయాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడానికి ఉపాధ్యాయులు సిద్ధం కావాలన్నారు. క్వాల్ కామ్, ట్రాన్స్‌ఫాం స్కూల్స్ స్వచ్ఛంద సంస్థలు రాష్ట్రంలోనే మొదటి సారి కలెక్టర్ కృషితో మారుమూల ములుగు జిల్లాను ఎంచుకోవడం గొప్ప విషయమన్నారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరంలో ములుగు మండలంలోని బండారుపల్లి, మదనపల్లి, వెంకటాపురం(ఎం) మండలంలోని జవహర్‌నగర్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ, ప్రోగ్రాం డైరెక్టర్ శ్రద్ధ ఝా, హెడ్ ప్రోగ్రాం, క్వాలిటీ ఇంప్లిమెంటేషన్ స్పెషలిస్ట్ నేహా రాణా, డీఈఓ పాణిని, లీడర్‌షిప్, కమ్యూనిటీ ప్రోగ్రాం మేనేజర్ హితేశ్‌దశభయ, టెక్నికల్ ప్రాజెక్టు ఆఫీసర్ మిహిర్ పాండా తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర స్వరూపాలు ట్రాన్స్ జెండర్లు

ట్రాన్స్‌జెండర్లు అర్ధనారీశ్వర స్వరూపాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ ఉమెన్ క్లినిక్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లాకు చెందిన తొమ్మిది మందికి ఐడీకార్డు, సర్టిఫికెట్‌ను అందించారు. ఆర్థిక పునరావాస పథకం కింద వందశాతం సబ్సిడీపై ఇద్దరికి రూ. 50వేలు స్వయం ఉపాధికి అందించారు. అంతకు ముందు ఐటీడీఏ తరఫున మంజూరైన ఆరు 108 వాహనాలను ప్రారంభించారు. డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, డీడబ్ల్యూఓ శిరీష, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, స్టాటికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, మేనేజర్ మహేందర్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఓ పీఓ చిత్రామిశ్రా, తదితరులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నలుగురు..

- ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి

ఎంజీఎం : ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కాసిపేట గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. తాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామానికి చెందిన సముద్రాల మొండయ్య (60) సముద్రాల శ్రీదేవి(50) కూతురు చైతన్య(30) శివప్రసాద్(28)ను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. మంగళవారం మధ్యాహ్నం విషమ పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన వీరికి వైద్యులు చికిత్స అందించారు. ఈ క్రమంలో బుధవారం పరిస్థితి విషమించి నలుగురు మృతి చెందారని వైద్యులు పేర్కొన్నారు. కాగా, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో బంధుమిత్రులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు.

గుమ్మడిదొడ్డిలో చిరుత సంచారం?

- రైతుపొలంలో పాదముద్రల గుర్తింపు
- అయితే హైనా, తోడేలు కావొచ్చంటున్న అటవీశాఖ సిబ్బంది
- గుర్తింపు కోసం ఫొటోలు పంపిన అధికారులు

వాజేడు: మండలంలో చిరుత సంచరించిదనే ప్రచారం జరుగుతోంది. మండలంలోని దూలాపురం రేంజ్ పరిధిలోని గుమ్మడి దొడ్డి గ్రామ సమీపంలో రెండు, మూడు రోజుల క్రితం చిరుత పులి సంచరించినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన రైతు ఎట్టి దేవదాసు పొలంలో చిరుత పులి పాదముద్రలను పోలిన ముద్రలు కనిపించాయి. విషయాన్ని వెంటనే అటవీశాఖ సిబ్బందికి తెలిపారు. దీంతో వారు బుధవారం పాదముద్రల గుర్తులు ఉన్న చోటుకు వెళ్లి వాటిని సేకరించారు. తోడేలు, లేదా హైనా అయి ఉంటుందని చెబుతున్నారు. కాగా, తోడేలు పాద ముద్రలు అంత పెద్దగా ఉండవని తెలిసింది. పాదముద్రలను గుర్తించడం కోసం ఫొటోలను జూసిబ్బందికి పంపించినట్లు సమాచారం. అయితే చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మాత్రం చిరుత పులి అడుగులే అని అనుమానిస్తున్నారు. ఈ విషయం వైరల్ అవుతోంది. ఈ విషయంపై వాజేడు రేంజర్ చంద్రమౌళి, దూలాపురం ఇన్‌చార్జ్ రేంజర్ బాలకృష్ణను 'సాక్షి' వివరణ కోరగా అవి చిరుత పులి పాదముద్రలు కావన్నారు. అయితే పరిశీలన కోసం ఫొటోలు జూ సిబ్బందికి పంపామన్నారు. హైనా, తోడేలు, కుక్క, నక్క.. ఇందులో ఏదో ఒక జంతువు పాదముద్రికలు అయి ఉండొచ్చని చెప్పారు.



చిరుత పాదముద్రలుగా భావిస్తున్న గుర్తు

జామాయిల్ తోటను ధ్వంసం చేసిన అధికారులు

- లబోదిబోమన్న రైతు
- రూ.2లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన

కురవి : సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలోని జామాయిల్ తోటను పెద్ద టవర్‌లైన్‌ను పర్యవేక్షించే అధికారుల బృందం సమాచారం ఇవ్వకుండా నరికేసిన (ధ్వంసం) ఘటన బుధవారం వెలుగుచూసింది. కురవికి చెందిన రైతు నూతక్కి సాంబశివరావు సర్వేనంబర్ 345, 346, 347 భూముల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో జామాయిల్‌తోట సాగు చేస్తున్నాడు. పంట చేతికొచ్చే సమయం ఆసన్నమైంది. ఈ తరుణంలో తోటపైనుంచి వెళ్తున్న పెద్ద టవర్‌లైన్‌కు సంబంధించిన అధికారులు తమ సిబ్బందితో కలిసి రెండు రోజుల నుంచి రెండు ఎకరాల విస్తీర్ణంలోని తోటను నరికేశారు. ఈ విషయంపై తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ తీగలకు అడ్డు ఉంటే సమాచారం ఇస్తే తామే తొలగించుకుంటామన్నారు. సమాచారం ఇవ్వకుండా రెండు ఎకరాల్లో సుమారు రూ.2లక్షల విలువైన చెట్లను ధ్వంసం చేయడం అన్యాయమని లబోదిబోమన్నాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



ధ్వంస చేసిన తోటను చూపుతున్న రైతు సాంబశివరావు

నర్సింహులపేటలో విషాదఛాయలు

- మాదన్నపేట చెరువులోకి దూసుకెళ్లిన కారు
- మృతుడు అగ్రికల్చర్ ఏఈఓ

నర్సింహులపేట: మండల కేంద్రానికి చెందిన మిర్యాల విష్ణు (25) బుధవారం నర్సంపేటలో జరిగిన తన స్నేహితుడి తమ్ముడి వివాహ వేడుకకు హాజరయ్యాడు. సమీపంలోనే మాదన్నపేట చెరువు ఉండడంతో చూసేందుకు కారులో వెళ్లాడు. మత్తడి సమీపంలో కారు నేరుగా చెరువులో దూసుకెళ్లింది. ఈ ఘటనలో విష్ణు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మిర్యాల వెంకన్న, పద్మ దంపతుల చిన్న కుమారుడు విష్ణు మండలంలోని జయపురం ఏఈఓగా పని చేస్తున్నాడు. మరిపెడ మండలం చిన్నగూడురు ఏఈఓగా పనిచేసిన విష్ణు.. 5 నెలల క్రితం బదిలీపై సొంత మండలానికి వచ్చాడు. ఈ క్రమంలో ఏఈఓ విష్ణు మృతి చెందడంతో స్నేహితులు, బంధువులు శోకసముద్రంలో మునిగారు. వారం రోజుల క్రితం విష్ణుకు వివాహం కుదిరింది. కారులో ఇదే గ్రామానికి చెందిన పట్వారి ప్రేమ్‌కుమార్ ఉన్నాడు. చెరువులో పడిన కారులో నుంచి ప్రేమ్‌కుమార్ ప్రాణంతో బయటపడగా.. విష్ణు మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.



విష్ణు మృతదేహం




కారు పడింది ఈ చెరువులోనే..

విద్యుదాఘాతంతో రైతు మృతి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని గిరిజనుల ఆరోపణ

కొడకండ్ల : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని హక్యాతండా జీపీ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. హక్యాతండా పంచాయతీ పరిధిలోని మంగ్యా తండాకు చెందిన గుగులోత్ శ్రీను (35) వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం మండలకేంద్రం శివారులో పొలం దున్ని నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ రైతు పామాయిల్ తోటకు అమర్చిన ఫెన్సింగ్ పై 11 కేవీ విద్యుత్ లైన్ తెగి పడి ఉండగా శ్రీను గమనించ లేదు. ఫెన్సింగ్‌కు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, తండావాసులు అక్కడకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. మధ్యాహ్నం వేళ విద్యుత్ లైన్ తెగిపడగా సిబ్బంది సరిచేయలేదన్నారు. వారి నిర్లక్ష్యంతోనే శ్రీను మృతి చెందాడని గిరిజనులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీను(ఫైల్)

అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

నయీంనగర్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టి ఆమోదించాలని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి మాయమాటలు చెప్పి కాలాయాపన చేస్తున్నాడని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి 30 ఏళ్లుగా దళితుల హక్కులను దోచుకుంటున్నాడని, ఒక్క మాదిగకు సాయం చేయలేదని విమర్శించారు. నమ్మక ద్రోహానికి కడియం శ్రీహరి బ్రాండ్ అంబాసిడర్ అని, తనపై కక్షతో ఎన్నో ఇబ్బందులకు గురి చేశాడని ధ్వజమెత్తారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

వీధి కుక్కల దాడి.. నలుగురికి గాయాలు

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ పరిధి కాజీపేట మండలం న్యూశాయంపేటలో బుధవారం వీధి కుక్కలు పలువురిపై దాడి చేశాయి. న్యూశాయంపేటలోని ఎస్సీ కాలనీకి చెందిన బుర్ల అనిల్‌తోపాటు మరో ముగ్గురిని గాయపరిచాయి. వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయించారు.



గాయాలను చూపిస్తున్న అనిల్
